22 ఏళ్లకే డాక్టరేట్.. నైనా జైశ్వాల్ రికార్డు



ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న నైనా జైశ్వాల్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 22 ఏళ్ల వయస్సులో డాక్టరేట్ అందుకున్న తొలి భారతీయురాలిగా నగరంలోని కాచిగూడకు చెందిన, టేబుల్ టెన్నిస్ అంతర్జాతీయ క్రీడాకారిణి నైనా జైశ్వాల్ రికార్డు నెలకొల్పారు. మైక్రో ఫైనాన్స్ ఇన్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అనే అంశంపై పరిశోధనలు చేసినందుకు గాను నైనా జైశ్వాల్ ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో గల ఆది నన్నయ్య యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఈమేరకు బుధవారం యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఏపీ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా నైనా జైశ్వాల్ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. చిన్న వయస్సులో పీహెచ్‌డీ పూర్తి చేయడం, గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా తీసుకోవడం సంతోషంగా ఉందని నైనా జైశ్వాల్ అన్నారు.


పద్మశ్రీ ఉమామహేశ్వరి దంపతులను సత్కరిస్తున్న అతిథులు

పద్మశ్రీ ఉమామహేశ్వరికి ఘన సత్కారం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సంస్కృతంలో హరికథ చెప్పగలిగే ఒకే ఒక్క భాగవతారిణి దాలిపర్తి ఉమా మహేశ్వరిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ పురస్కారం ప్రకటించడం అభినందనీయమని తెలంగాణ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. గురువారం ప్రణవ్ కూచిపూడి నృత్య శిక్షణాలయం ఆధ్వర్యంలో పద్మశ్రీ అవార్డు ప్రకటిత భాగవతారాణి డి.ఉమామహేశ్వరికి అభినందన సత్కారం చేశారు. పలువురు నృత్య కళాకారులు పాల్గొని ఆమెను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా బుర్రా వెంకటేశం హాజరై మాట్లాడారు. హరికథకు తగిన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరముందని అన్నారు. ఈ కార్యక్రమంలో డా.పద్మజారెడ్డి, కళాకృష్ణ, డా.పసుమర్తి రామలింగశాస్త్రి, డా.కోట్ల హనుమంతరావు, డా.భాగవతుల సేతూరామ్, డా.వనజా ఉదయ్, రమాదేవి, అంజుబాబు, డా.మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.


పురస్కారగ్రహీతల్ని సత్కరిస్తున్న అతిథులు

'అక్కినేని' పురస్కారాల ప్రదానోత్సవం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సినీ జీవితంలోనే కాకుండా నిజ జీవితంలో కూడా ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన గొప్ప వ్యక్తి అక్కినేని నాగేశ్వరరావు అని ఏపీ పాఠశాల నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చైర్మన్ ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. గురువారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో సారిపల్లి కొండలరావు సారథ్యంలో యువకళావాహిని ఆధ్వర్యంలో నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు అభినయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.వి.నారాయణరావు, ఆర్.ప్రసన్నరాణి, జెన్నిలకు ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ రామలింగేశ్వరరావు పురస్కారగ్రహీతల్ని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సారిపల్లి కొండలరావు, కె.వి.కృష్ణకుమారి, రామసత్యనారాయణ, ఎస్.వి.రామారావు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం నిర్వహించండి..!

- హైకోర్టులో బీజేపీ కార్పొరేటర్ పిటిషన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం నిర్వహణకు ఆదేశాలు జారీ చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్టు మల్కాజ్‌గిరి కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు. పాలకమండలి ఎన్నికై మూడేళ్లు కావస్తోందని.. ఇప్పటి వరకు 30 గంటలు కూడా ప్రజాసమస్యలపై చర్చ జరగలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఏడు సమావేశాలు మాత్రమే జరిగాయని, ఎజెండా, సభ్యుల ప్రశ్నలపై పూర్తిస్థాయి చర్చ జరిగిన దాఖలాలు లేవన్నారు. ప్రజాస్వామ్య దేశంలో చట్టసభలు కోర్టు ఆదేశాల ద్వారా నడపాల్సి రావడం దౌర్భాగ్యమని ఆయన పేర్కొన్నారు.

పైసలివ్వక ఆగిన పనులు..

(5వ పేజీ తరువాయి)

ఉన్నారు. అయితే, ఇప్పటివరకు ఈ ప్రాజెక్టు పూర్తికాకపోవడానికి నిర్దిష్ట కారణాలను రైల్వే అధికారులు నూతన ప్రభుత్వం దృష్టికి ఇంకా తీసుకుపోలేదని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా అందితే పనులు యుద్ధప్రాతిపదికన పూర్తవుతాయని రైల్వే అధికారులు అనధికారికంగా స్పష్టం చేస్తున్నారు.

యాదాద్రి ప్రతిపాదనలకు బ్రేక్

ఎంఎంటీఎస్ రెండోదశలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా చెల్లించకపోవడంతో పాటు యాదాద్రి వరకు పొడిగింపు విషయమై ఓకే చెప్పకపోవడంతో పనులకు బ్రేక్ పడినట్టు దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలకు రైల్వే శాఖ ఆమోదం తెలుపుతూ ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ రెండో దశను పొడిగించడానికి అంగీకరించింది. మొదట్లో రూ.350 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశారు. ఆ తర్వాత అంచనా వ్యయం పెరిగింది. ప్రాజెక్టులో భాగంగా ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి వరకు కొత్తగా నిర్మించవలసిన స్టేషన్లు, ఇప్పటికే ఉన్న స్టేషన్లను అభివృద్ధి చేయడం, ట్రాక్ నిర్మాణం తదితర పనుల కోసం రైల్వే శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే, ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి లిఖిత పూర్వక అంగీకారం రాలేదని తెలిసింది. దాంతో ప్రస్తుతానికి ఈ ప్రతిపాదలకు బ్రేక్ పడినట్టు సాక్షాత్తూ రైల్వే జీఎం వెల్లడించారు.

సివరేజీ నిర్వహణ బంద్

(5వ పేజీ తరువాయి)

నేపథ్యంలో మరో రెండు నెలల పాటు కొనసాగించారు. నవంబర్, డిసెంబర్, జనవరి నెలకు వాహనాల బిల్లులను పెండింగ్ పెడుతూ అధికారులు వచ్చారు. సంస్థలో ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వాయిదా వేస్తూ వచ్చారు.

కొత్త ఎస్ఎస్ఆర్ ప్రకారమే చెల్లించాలి..

దళితబంధు పథకంలో భాగంగా మూడు నెలల క్రితం 160 వరకు సిల్ట్ కార్టింగ్ (పూడికతీత వ్యర్థాల రవాణా) వాహనాలను ప్రవేశ పెట్టారు. దీంతో ఒక్కో జెట్టింగ్, మినీ ఎయిర్ టెక్ వాహనానికి రూ.40వేలు తగ్గిస్తామని, పూడిక తీత వ్యర్థాల రవాణా చేయొద్దని వాటర్ బోర్డు అధికారులు సూచించారు. ఈ నేపథ్యంలో జరిగిన చర్చల్లో 2010లో జరిగిన ఒప్పంద ప్రకారమే బిల్లులు ఇస్తామని జలమండలి, కొత్త ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం బిల్లులు చెల్లించాలని సీవర్ క్లీనింగ్ మెషిన్స్ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే వారు వాహనాలను ఎక్కడికక్కడ నిలిపివేశారు. బిల్లులు చెల్లించే వరకూ పూడిక తీత పనులు చేపట్టబోమని, బిల్లులో కోతలు పెడితే కుదరదని సీవర్ క్లీనింగ్ మెషిన్స్ ఓనర్స్ అసోసియేషన్ తేల్చి చెప్పింది. మొత్తంగా కొన్నిచోట్ల పూడికతీత పనులపై వీరి ప్రభావం పడుతోంది. పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు విధుల్లోకి చేరబోమని అసోసియేషన్ నేతలు స్పష్టంగా చెబుతుండగా.. అధికారుల నుంచి ఎటువంటి స్పందన రాలేదు. ఒక్కరోజు సివరేజీ నిర్వహణ సక్రమంగా లేకుంటే రోడ్లు అధ్వానంగా మారతాయి. పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు తమ వాహనాలు విధుల్లో చేరవని అసోసియేషన్ నేతలు గౌస్, శ్రీధర్, విజయ్‌కుమార్, చింతల రాజలింగం, కల్పన, వేణుగోపాల్, నరేష్ ప్రకటించారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా

హైదరాబాద్ శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో మూడు పూలు, ఆరు కాయలు అన్న చందంగా అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతోంది. వందల సంఖ్యలో అనుమతి లేని భవనాలు, ఇతర నిర్మాణాలు జరుగుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమాలను అరికట్టి మున్సిపాలిటీకి ఆదాయాన్ని సమకూర్చాల్సిన అధికారులే అక్రమార్కులకు బాసటగా నిలుస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో , గురువారం ఉదయం అధికారులు, టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో కలిసి కమిషనర్ రవీందర్‌రెడ్డి అక్రమ నిర్మాణాలను కూల్చివేయించారు.

- 81-9వ వార్డులో అక్రమ షెడ్డు నిర్మాణ గోడలను తొలగిస్తున్న సిబ్బంది
- పలు వార్డుల్లో కొనసాగుతున్న షెడ్డుల కూల్చివేత
- కుంట్లూర్‌లో అనుమతులు లేని సెల్లార్ పనుల నిలిపివేత
- అనుమతులు తీసుకున్నాకే నిర్మాణాలు చేపట్టాలి
- కమిషనర్ రవీందర్‌రెడ్డి హెచ్చరిక

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు మున్సిపల్ అధికార యంత్రాగం రంగంలోకి దిగింది. గత ఏడాది కాలంగా అక్రమ నిర్మాణాలను పట్టించుకోని మున్సిపల్ అధికారులకు జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాలతో కదలిక వచ్చింది. గురువారం ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన "అందరికీ ఫిక్స్!" కథనానికి పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ స్పందించారు. ఈమేరకు గురువారం ఉదయం అధికారులు, టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో కలిసి కమిషనర్ రవీందర్‌రెడ్డి అక్రమ నిర్మాణాలను సందర్శించారు. కుంట్లూర్‌లో కొనసాగుతున్న అనుమతులు లేని సెల్లార్ పనులను నిలిపివేయించారు. అక్కడ ఉన్న సామగ్రిని స్వాధీనం చేసుకుని వార్డు కార్యాలయానికి తరలించారు.

అనంతరం 2, 5, 9, 22వ వార్డుల్లో, మర్రిపల్లి గ్రామంలో కొనసాగుతున్న అనుమతులు లేని షెడ్లు, నిర్మాణాలను సిబ్బందితో కూల్చివేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీందర్‌రెడ్డి మట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా అనుమతులు తీసుకున్న తర్వాతనే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ, మున్సిపల్ అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు పెడుతామని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలకు ఎవరు సహకరించినా వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్లు హరికుమార్, అశోక్, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


అనుమతులు లేని సెల్లార్ నిర్మాణ పనులను నిలిపివేస్తున్న కమిషనర్ రవీందర్‌రెడ్డి, సామగ్రిని తీసుకెళ్తున్న మున్సిపల్ సిబ్బంది



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

కుర్మల్‌గూడలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

సరూర్‌నగర్ : బాలాపూర్ మండలం కుర్మల్‌గూడలోని సర్వే నంబర్. 46లో గల ప్రభుత్వ భూమిలో వెలిసిన పలు అక్రమ నిర్మాణాలను గురువారం తెల్లవారుజామున రెవెన్యూ అధికారులు కూల్చివేయించారు. ఆదిభట్ల పోలీసుల బందోబస్తు నడుమ కొనసాగిన ఈ కూల్చివేతల్లో భాగంగా అక్రమంగా నిర్మించిన పలు గదులు, షెడ్లతో పాటు పలు బేస్మెంట్లను సైతం ఎక్సకవేటర్ల సాయంతో తొలగించారు. తహసీల్దార్ కె.మాధవీరెడ్డి ఆధ్వర్యంలో ఈ కూల్చివేతలు జరుగగా, బాధితులు తమకు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఓ బాధితుడు ఎక్సకవేటర్‌కు అడ్డంగా నిల్చుని ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయబోగా పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. కాగా తాము మూడు రోజుల క్రితమే నోటీసులు ఇచ్చామని, అయినా ఖాళీ చేయకపోవడంతో కూల్చివేతలు చేపట్టామని తహసీల్దార్ మాధవీరెడ్డి చెప్పారు. ఈ నిర్మాణాలపై ఫిర్యాదులు రావడంతో విచారణ జరిపామని, విచారణంలో అవి ప్రభుత్వ స్థలంలో నిర్మించినవిగా తేలడంతో కూల్చివేశామని ఆమె స్పష్టం చేశారు. కాగా పలువురు తమ వద్ద డాక్యుమెంట్లు ఉన్నాయని పేర్కొనగా వారికి కొంత సమయం ఇచ్చినట్టు చెప్పారు. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా చర్యలు తప్పవని, నోటీసులు ఇవ్వకుండా కూల్చేసే అధికారం తమకు ఉన్నదని ఆమె పేర్కొన్నారు.

నాయకులు విలువలకు కట్టుబడి పనిచేయాలి

- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి



మాట్లాడుతున్న గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : నమ్మిన సిద్ధాంతం కోసం కష్టపడి పనిచేసే వారికి ఏదో ఒక సమయంలో గుర్తింపు వస్తుందని, రాజకీయంగా అవకాశం వచ్చినవారు విలువలకు కట్టుబడి అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడాలని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి గార్డెన్స్‌లో గవర్నర్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సహా పలు హిందూ, యువజన సంఘాల నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ 1979-80లో తాను నల్లగొండ ఎంపీగా పోటీ చేసినప్పుడు కొన్నిచోట్ల తనను ప్రచారానికి రాకుండా కొందరు అడ్డుపడ్డారని గుర్తుచేశారు. అప్పటికీ, ఇప్పటికీ రాజకీయంగా అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం ఎవరు ఎక్కడి నుంచైనా పోటీచేసే అవకాశం ఉందన్నారు. తనకు గవర్నర్‌గా అవకాశం వస్తుందని ఊహించింది కాదన్నారు. రైతులు, నిరుద్యోగ యువత, వ్యవసాయ కార్మికుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారిపై ఉంటుందన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు బోసుపల్లి ప్రతాప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, ఎంపీపీ సుకన్య, బీజేపీతో పాటు పలు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం

పరిశీలించిన ఆర్డీఓ

మన్సూరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మన్సురాబాద్ సర్వే నం.5లోని ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న ఇంటి నిర్మాణాన్ని కందుకూరు ఆర్‌డీఓ సూరజ్‌కుమార్, సరూర్‌నగర్ తహసీల్దార్ కృష్ణ గురువారం పరిశీలించారు. చంద్రకళ అనే మహిళ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇంటిని నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఇటీవల ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్‌డీఓ వివరాలు సేకరించి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చేందుకు ప్రత్యక్షంగా ఆ నిర్మాణాన్ని పరిశీలించారు. అయితే స్థానికంగా చేపట్టిన నాలా నిర్మాణం సందర్భంగా తన స్థలాన్ని కోల్పోయానని, అప్పుడు అధికారులు ఇచ్చిన హామీమేరకు నిర్మాణం చేపడుతున్నట్లు సదరు మహిళ ఆర్‌డీఓకు వివరించినట్లు అధికారులు తెలిపారు. కాగా, ఆమె వద్ద ఉన్న పత్రాలను, ఇతర ఆధారాలన్నింటినీ పరిశీలించిన ఆర్‌డీఓ.. సదరు నిర్మాణంపై కలెక్టర్‌కు నివేదిక పంపుతారని, కలెక్టర్ ఆదేశాలతో తగిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తహసీల్దార్ కృష్ణ పేర్కొన్నారు.

అంతేకాకుండా సర్వే నెం.93లోని 22గుంటల ప్రభుత్వ భూమిని పార్కు స్థలానికి కేటాయించగా.. ప్రైవేటు వ్యక్తులు (సర్వే నం.92లోని వ్యక్తులు) తమదని కోర్టులో కేసు వేసిన నేపథ్యంలో ఆర్‌డీఓ సదరు స్థలాన్ని కూడా పరిశీలించారు. ఈ క్రమంలో మొదటగా సర్వే నం.93లోని ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దులు నిర్ధారించాలని నిర్ణయించినట్లు తహసీల్దార్ వివరించారు.

బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు ఢీకొట్టిన ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. నాగోల్ పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం రాత్రి ఓ గుర్తుతెలియని వ్యక్తి (సుమారు 50) నాగోల్ ఫ్లైఓవర్‌పై నుంచి నడుచుకుంటూ కొంతదూరం వెళ్లాడు. మళ్లీ వెనక్కి వచ్చే క్రమంలో మధ్యలో డివైడర్ వైపు పరిగెత్తాడు. ఈ క్రమంలో ఉప్పల్ నుంచి ఎల్‌బీనగర్ వైపు వేగంగా వచ్చిన ప్రైవేటు బస్సు అతన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని పోలీసులు వివరించారు. అయితే మరణించిన వ్యక్తికి సంబంధించిన వివరాలు తెలియరాలేదని పోలీసులు పేర్కొన్నారు. అతన్ని గుర్తుపట్టిన వారు పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

వనస్థలిపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్ర జ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఆటోసాయినగర్‌లోని నాగార్జున లారీ ట్రాన్స్‌పోర్ట్ సముదాయాల వద్ద గల భవనంలోని రెండవ అంతస్తులో పాడుబడిన గదిలో గుర్తు తెలియని వ్యక్తి(58) మృతి చెందాడు. దీంతో దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చుట్టుపక్కల వారిని విచారించగా, సమాచారం లేకపోవడంతో కుళ్లిపోయిన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో యువతి ఆత్మహత్య

కొత్తపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని రాక్‌టౌన్ కాలనీలో అనారోగ్యంతో యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై లింగారెడ్డి కథనం ప్రకారం... రాక్‌టౌన్ కాలనీలో ఉండే కన్నె కంటి దీప్తి (18) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. గురువారం మధ్యాహ్నం దీప్తి గదిలో పడుకునేందుకు వెళ్లింది. ఆమె సోదరి డాక్టర్ పావని మెడికల్ షాప్‌లో మందులు కొనడానికి వెళ్లింది. ఆమె తిరిగి వచ్చేసరికి బెడ్‌రూమ్ లోపలి నుంచి లాక్ చేసి ఉంది. పిలిచినా దీప్తి పలకకపోవడంతో ఆమె తలుపు బద్దలుకొట్టి లోపలికి వెళ్లి చూడగా, దీప్తి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని కనిపించింది. పావని ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.


శ్రీ ధ్యానాంజనేయస్వామి దేవాలయం ట్రస్ట్ సభ్యులు సచివాలయంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి స్వామివారి ప్రసాదం, వస్త్రాలు సమర్పించి ఆశీర్వదించారు. ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించారు.

స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఆపివేయాలి

సైదాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ ప్రధాన రహదారిపై హనుమాన్ ఆలయం మీదుగా చేపడుతున్న స్టీల్ బ్రిడ్జి (ఫ్లైఓవర్) నిర్మాణ పనులు ఆపివేసి, రీ అలైన్‌మెంట్ చేయాలని కోరుతూ గురువారం రోనాల్డ్‌రాస్‌కు బీజేపీ కార్పొరేటర్లు కలిసి వినతిపత్రం సమర్పించారు. సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన మహిమ గల హనుమాన్ ఆలయం మీదుగా బ్రిడ్జి నిర్మాణం చేపడితే భక్తులు సహించరని తెలిపారు. కొందరికి అనుకూలంగా జీహెచ్ఎంసీ, ఎస్ఆర్‌డీపీ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇందుకు కమిషనర్ స్పందించి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సైదాబాద్, ఐఎస్‌సదన్, మూసారాంబాగ్, గౌలిపురా కార్పొరేటర్లు కొత్తకాపు అరుణారెడ్డి, జంగం శ్వేతారెడ్డి, బొక్కభాగ్యలక్ష్మి, అలె భాగ్యలక్ష్మిలు తెలిపారు.


డాక్టర్ స్వర్ణలతను అభినందిస్తున్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తదితరులు.

తెలంగాణ జీవన్‌దాన్‌కు హెచ్ఐఈఎఫ్‌డబ్ల్యూ అవార్డు

హైదరాబాద్ సిటీ/సనత్‌నగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ జీవన్‌దాన్ సంస్థ సేవలకుగాను హయత్ ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ ఫ్రేమ్ వర్క్ (హెచ్ఐఈఎఫ్‌డబ్ల్యూ) అవార్డు దక్కింది. మరణించిన, బ్రెయిన్‌డెడ్‌కు గురైన వారి అవయవాలు సేకరించి, అవయవ మార్పిడికి చేసిన అసాధారణ కృషి, సేవలు, విజయాలకు ఈ అవార్డు లభించిందని జీవన్‌దాన్ తెలంగాణ ఇన్‌చార్జ్ డాక్టర్ స్వర్ణలత తెలిపారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్గాన్ డొనేషన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ అలీ అబ్దుల్ కరీం ఒబ్బాది, నేషనల్ సెంటర్ ఫర్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ డైరెక్టర్ డాక్టర్ మరియా పౌలాగోమెజ్‌లు అవార్డును అందించారు. అవార్డు సాధించిన డాక్టర్ స్వర్ణలతను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్‌లు అభినందించారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీపీ సుధీర్‌బాబు

రాచకొండ పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ 5వ వార్షిక స్పోర్ట్ మీట్-2024 గురువారం ప్రారంభమైంది. ఈ మీట్‌ను రాచకొండ సీపీ సుధీర్ బాబు ప్రారంభించి మాట్లాడారు. విధినిర్వహణలో సిబ్బందికి ఎదురయ్యే ఒత్తిడులను, వివిధ రకాల సవాళ్లను ఎదుర్కొంటూ ఉపశమనం పొందేందుకు ఇలాంటి స్పోర్ట్స్ మీట్‌లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర, ఎస్ఓటీ డీసీపీ-1 గిరిధర్‌రావు, ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఎస్ఓటీ-2 డీసీపీ మురళీధర్, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, డీసీపీ క్రైమ్స్ అరవింద్‌కుమార్, డీసీపీ అడ్మిన్ ఇందిర, ఎస్బీ డీసీపీ కరుణాకర్, ట్రాఫిక్ డీసీపీలు, అదనపు డీసీపీలు, అధికారులు పాల్గొన్నారు.


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ చీఫ్ అడ్వైజర్‌గా బాధ్యతలు చేపట్టిన హెచ్.వేణుగోపాల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ తదితరులు - చాదర్‌ఘాట్,ఆంధ్రజ్యోతి

క్రీడలతో ఒత్తిడి దూరం : సైబరాబాద్ సీపీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడి నుంచి బయటపడేందుకు క్రీడలు సహకరిస్తాయని, ప్రతి పోలీస్ అధికారి తప్పనిసరిగా ఏదో ఒక క్రీడాంశంలో పాల్గొనాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మొహంతి అన్నారు. సైబరాబాద్ కమిషనరేట్‌లోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో గురువారం 6వ వార్షిక పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ క్రీడాకారుల గౌరవవందనం స్వీకరించారు. సీఏఆర్ హెడ్ క్వార్టర్ ఏడీసీపీ షమీర్, డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.